'నీరా కేఫ్' టెండర్లు రద్దు చేయాలి

• మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

నీరా కేఫ్ టెండర్లను వెంటనే రద్దు చేయాలని మాజీ మంత్రి వి శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. నీరా కేఫ్, దాని సంబంధిత ఆస్తులను ప్రయివేటు వ్యక్తులకు అప్పగించాలని చూస్తున్నారన్న ఆందోళన నేపథ్యంలో భువనగిరి మాజీ శాసన సభ్యుడు పైళ్ల శేఖర్ రెడ్డి, రాష్ట్ర కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవి కుమార్ గౌడ్‌లతో కలిసి యాదాద్రి జిల్లా నందనం వద్ద రూ.ఏడు కోట్లతో నెలకొల్పిన నీరా ఉత్పత్తుల కేంద్రాన్ని ఆదివారం శ్రీనివాస్ గౌడ్ సందర్శించారు. కల్లుగీత కార్మికులు, గౌడ్ల అభ్యున్నతి కోసం తాము నీరా కేఫ్, నందనం నీరా ఉత్పత్తుల కేంద్రాన్ని నెలకొల్పామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని ప్రారంభించకపోవడంతో యంత్రాలు తుప్పుపడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్సైజ్ శాఖ మంత్రి తక్షణమే నందనం కేంద్రాన్ని సందర్శించి, జూన్ రెండు లోగా ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

మునీర్ మృతి పట్ల మంత్రి దామోదర రాజనర్సింహ విచారం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మునీర్ మరణం పట్ల తెలంగాణ రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ విచారం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. నిత్యం ప్రజల కోసం పరితపించే మునీర్ ఇంత త్వరగా వెళ్లిపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. వారికి అండగా ఉంటామని హామీనిచ్చారు.

వేడుకగా తెలంగాణ చెఫ్స్ అసోసియేషన్ వార్షికోత్సవం

హైదరాబాద్ బ్యూరో : తెలంగాణ చెఫ్స్ అసోసియేషన్ ఆరో వార్షికోత్సవం, క్యులినరీ కాన్క్లేవ్ 2025ను ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ కలినరీ అసోసియేషన్ (ఐఎఫ్‌సిఎ) అధ్యక్షుడు చెఫ్ మంజీత్ సింగ్ గిల్ ప్రారంభించారు. హైదరాబాద్‌లో దీనిని తెలంగాణ చెఫ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'రూట్స్ టు రోబోట్స్ - ది ఎవల్యూషన్ ఆఫ్ క్యులినరీ క్రాఫ్ట్' అనే థీమ్‌తో నిర్వహించారు. ఈ సందర్భంగా మంజీత్ సింగ్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఉన్న సంప్రదాయ వంటలను పరిరక్షించడం, ప్రతి కిచెన్లో, ప్రతి విందులో, ప్రతి అతిథి అనుభవం కొత్త దనం, వంటకం మన ప్రత్యేకతని, దానిని సంరక్షించాలని చెప్పారు. తెలంగాణ చెఫ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చెఫ్ ధర్మేంద్ర లాంబా మాట్లాడుతూ ఈ ఈవెంట్ ఒక వేడుక మాత్రమే కాదని, భవిష్యత్తుకు సిద్ధమైన క్యులినరీ సమాజాన్ని నిర్మించేందుకు ఇది ఒక ఉద్యమం అన్నారు.

దున్నేవానికే భూమి దక్కాలి

• రాజా బహదూర్ బినామీలను తరిమికొట్టాలి
• ఒకే వ్యక్తి పేరున 480 ఎకరాలు ఉండడం సీలింగ్ యాక్ట్‌కు విరుద్ధం
• ఉద్యమాల ద్వారానే భూముల హక్కులు సాధించుకోవాలి : జాన్ వెస్లీ



రైతులతో మాట్లాడుతున్న జాన్ వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దున్నేవానికే భూమి దక్కాలని, కొందరు ఆక్రమణదారులు గిరిజనుల భూములపై కన్నేశారని, ఒక వ్యక్తి పేరు మీద 400 ఎకరాల భూమి ఉండటం సీలింగ్ యాక్ట్‌కు విరుద్ధమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. ఆదివారం వనపర్తి జిల్లా ఖిల్లా ఘనపూర్ మండలం షాపూర్‌శివారు, మామిడిమాడ శివారు భూముల్లో సాగు చేసుకుంటున్న గిరిజనులకు పట్టాలివ్వాలని సిపిఎం, భూ పోరాట సాధన కమిటీ, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, తెలంగాణ గిరిజన సంఘం ఆధ్వర్యంలోని బృందం పర్యటించింది. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. నాలుగు నెలలుగా ఆందోళన నిర్వహిస్తున్నా, పాదయాత్రలు చేసినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరైనది కాదన్నారు. ఘనపూర్ మండల పరిధిలోని ఎనిమిది గిరిజన తండాలకు చెందిన 800 గిరిజన కుటుంబాలు 480 ఎకరాల భూములను ఐదు తరాలుగా సాగు చేసుకుంటున్నారని తెలిపారు. కాగా, రాజ బహదూర్ పేరుతో ఇప్పుడు వచ్చి ఆ భూములు మావంటూ కబ్జా చేసుకునే ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. సాగు భూములు తప్ప ఇతర ఆస్తులు లేని అమాయక గిరిజనులను భయభ్రాంతులకు గురి చేయడం దారుణమన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ ఎండోమెంట్ భూదాన్ ఉద్యమాలనే టార్గెట్ చేస్తూ భూ బకాసురులు భూములను ఆక్రమించుకుంటున్నారని తెలిపారు. దేశవ్యాప్తంగా సీలింగ్ యాక్ట్ అమల్లో ఉన్నప్పటికీ బడా భూస్వాములైన రాజా బహదూర్ బినామీలకు ఇంత పెద్ద మొత్తంలో భూములు ఉండటానికి కారణమేమిటని ప్రశ్నించారు. ఏండ్ల తరబడి గిరిజన కుటుంబాలు కలెక్టర్ ఆర్డీఓ, ఎమ్మార్వోల చుట్టూ పట్టా కోసం తిరిగినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. కలెక్టర్ గిరిజనుల విన్నపాన్ని సిసిఎల్‌కు పంపినా అక్కడి నుంచి ఎలాంటి సమాధానం రాకపోవడం చూస్తుంటే ఈ పాలకులు ఎవరి పక్షాన ఉంటున్నారో తెలుస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సాగుచేసుకుంటున్న గిరిజనులకు పట్టాలివ్వాలని, సీలింగ్ చట్టం ప్రకారం రాజ బహదూర్‌కు ఉన్న పట్టాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజనులు ఐక్యమత్యంతో ఉండి పట్టాలు సాధించుకునే దాకా సిపిఎం వారికి అండగా నిలుస్తుందని, ముందుండి పోరాడుతుందని తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు మాట్లాడుతూ.. వందల సంవత్సరాల నుంచి సాగు చేసుకుంటున్న గిరిజన తండా వాసులకు పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మేకల ఆంజనేయులు, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి బాల్య నాయక్, భూ పోరాట సాధన కమిటీ కన్వీనర్ శుక్రు నాయక్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి పరమేశ్వర చారి, ఐద్వా జిల్లా కార్యదర్శి లక్ష్మి, నాయకులు జయమ్మ, కృష్ణ, భరత్, దాసు, శ్రీను, లక్ష్మనాయక్, రాజి, మన్నె తదితరులు పాల్గొన్నారు.



విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ వీరయ్య

తెలంగాణ సాయుధ రైతాంగ పోరులో

పిఎన్ఎం కళారూపాల పాత్ర గొప్పది

• ఇప్టా జాతీయ ఉపాధ్యక్షులు కందిమల్ల ప్రతాపరెడ్డి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ సాయుధ రైతాంగ పోరులో కళారూపాలను తయారు చేసి జన చైతన్యంలోకి ఊతమిచ్చిన గొప్ప సంస్థ ప్రజా నాట్యమండలి అని ఇండియన్ పీపుల్స్ థియేటర్స్ అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షులు కందిమల్ల ప్రతాపరెడ్డి అన్నారు. అసోసియేషన్ 83వ ఆవిర్భవ దినోత్సవం సందర్భంగా ఆదివారం హిమాయత్ నగర్‌లోని ఎన్.సత్యనారాయణరెడ్డి భవన్‌లో ప్రముఖ విప్లవ నటుడు మాదాల రంగారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1943 మే 25న దేశంలో ఉన్నతమైన లక్ష్యాలతో అసోసియేషన్ ప్రారంభమైందని, యుద్ధాలకు వ్యతిరేకంగా అటు స్వాతంత్ర్య, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో కళారూపాలను తయారు చేసి ప్రజలను చైతన్యవంతం చేసిన గొప్ప సంస్థ అని అన్నారు. దేశ భవిష్యత్తు కోసం స్వాతంత్ర్య పోరాటంలో సాంస్కృతిక ఉద్యమం సాగిందని తెలిపారు. నేడు కులం, మతం పేరిట ప్రజలు కొట్టుకుచస్తున్నారని, కులరహిత సమాజం కోసం ప్రజా కళాకారులు తమ కళలు, సాహిత్యం ద్వారా చైతన్యవంతులను చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రముఖ విప్లవ నటులు, దర్శకులు మాదాల రంగారావు జయంతి సందర్భంగా ఎర్రమల్లెలు, ఎర్ర సూర్యుడు, విప్లవ శంఖం సినిమాల్లోని పాటలు పాడుతూ నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కురిమిద్ద శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహ, ఉపాధ్యక్షులు కన్నం లక్ష్మినారాయణ, సహాయ కార్యదర్శి కేతరాజు ఉప్పలయ్య, కార్యవర్గ సభ్యులు డి వేణుగోపాల్, జనసేవా దళ్ నాయకులు మురళీకృష్ణ, ఎఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా నాయకులు కాంపల్లి కల్యాణ్, అనిల్ కుమార్, కళాకారులు రాము, శేఖర్, విజయ్ కుమార్, భాస్కర్, మహేష్, పరుశురాం, రమేష్ పాల్గొన్నారు.

త్రివేణి సంగమంలో గవర్నర్ దంపతుల పుష్కర స్నానం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాళేశ్వరంలోని త్రివేణి సంగమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దంపతులు పుష్కర స్నానం ఆచరించి ముక్తేశ్వర ఆలయం సందర్శించారు. ఆదివారం హైదరాబాద్ నుంచి ఉదయం 11.02 గంటలకు హెలికాప్టర్ ద్వారా జయశంకర్-భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం చేరుకున్న గవర్నర్ దంపతులకు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్‌పి కిరణ్ ఖరే పుష్పగుచ్ఛం అందించి ఘనస్వాగతం పలికారు. హెలిప్యాడ్ నుంచి నేరుగా త్రివేణి సంగమం సరస్వతి ఘాట్ వద్దకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దంపతులు చేరుకున్నారు. సరస్వతి ఘాట్ శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి పుణ్యస్నామాచరించారు. అనంతరం సరస్వతి ఏక శిలా విగ్రహాన్ని దర్శించుకున్నారు. పుష్కర స్నానానంతరం గవర్నర్ దంపతులు శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. వారికి దేవాదాయ శాఖ డైరెక్టర్ వెంకట్ రావు, ఆలయ పూజారులు పరిచట్టం, పూర్ణ కుంభం, మంగళవాయిద్యాలతో స్వాగతం తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు ప్రతి రోజూ సాయంత్రం నిర్వహిస్తున్న సరస్వతి నవరత్న మాలా హారతి కార్యక్రమాన్ని వివరించారు. పుష్కర ఏర్పాట్లను గవర్నర్ పరిశీలించి అధికారులను అభినందించారు. 11 రోజుల నుంచి పుష్కరాలు వైభవంగా జరుగుతున్నాయని, సందర్శకులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని ఏర్పాట్లు చేసిన జిల్లా యంత్రాంగాన్ని అధికారులను, సిబ్బందిని గవర్నర్ అభినందించారు.



ముక్తేశ్వర ఆలయాన్ని సందర్శిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దంపతులు

వచ్చే మూడురోజులు భారీ వర్ష సూచన

• పలు జిల్లాలకు ఎల్లో హెచ్చరిక జారీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో వచ్చే మూడు రోజుల పాటు పలు జిల్లాల్లో భారీ వర్షాలు పడే సూచనలు ఉన్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి డాక్టర్ కె.నాగరత్న హెచ్చరించారు. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో హెచ్చరిక జారీ చేశారు. అదే సమయంలో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఐదు నుంచి ఏడు డిగ్రీల మేర తగ్గే సూచనలు ఉన్నట్టు తెలిపారు. ఆదివారం ఉదయం 8:30 నుంచి రాత్రి 10 గంటల వరకు 200 ప్రాంతాల్లో వర్షపాతం నమోదైంది. సోమవారంనాడు ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో, మంగళవారంనాడు భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట జిల్లాల్లో, 28న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్ధిపేట జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముంది. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో కూడిన గాలులు వీచే అవకాశముంది. హైదరాబాద్‌లో వచ్చే 48 గంటల పాటు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. నగరంలో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో తేలికపాటి నుంచి మోస్తరు వానలు పడే సూచనలున్నాయి. నైరుతి రుతుపవనాలు చురుగ్గా ముందుకు సాగుతూ విస్తరిస్తున్నాయి. కర్ణాటకలోని మరికొన్ని ప్రాంతాలకు, గోవా అంతటా, మహారాష్ట్ర, మణిపూర్, నాగాలాండ్, మిజోరంలోని కొన్ని ప్రాంతాలకు, బంగాళాఖాతంలోని పలు ప్రాంతాలకు వ్యాప్తిచెందాయి.

కరీంనగర్‌లో కాంటినెంటల్ టైర్స్ స్టోర్ ఏర్పాటు

బిజినెస్ బ్యూరో :ప్రముఖ ప్రీమియం టైర్ల తయారీ సంస్థ కాంటినెంటల్ టైర్స్ కొత్తగా కరీంనగర్‌లో తమ ఫ్లాగ్‌షిప్ కాంటినెంటల్ ప్రీమియం డ్రైవ్ డీలర్‌షిప్ (సిపిడి)ని ప్రారంభించినట్లు తెలిపింది. ఇది రాష్ట్రంలో తమకు 10వ సిపిడి స్టోర్ అవుతుందని పేర్కొంది. ఈ కొత్త డీలర్‌షిప్ 1,900 చదరపు అడుగుల స్థలంలో విస్తరించి ఉందని కాంటినెంటల్ టైర్స్ ఇండియా ఎండి సమీర్ గుప్తా పేర్కొన్నారు. వీల్ అలైన్‌మెంట్, వీల్ బ్యాలెన్సింగ్, టైర్ మార్పిడం, నైట్రోజన్ ఫిల్లింగ్ వంటి అనేక రకాల సేవలను అందిస్తుందన్నారు.

మిస్ ఇంగ్లండ్ ఆరోపణలపై విచారణ

• సీనియర్ ఐపిఎస్ అధికారి షికా గోయల్ నేతృత్వంలో కమిటీ
• పోటీదారులతో పాటు నిర్వాహకులను ప్రశ్నించిన అధికారులు
• ఆరోపణలు అవాస్తవం : జయేష్ రంజన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మిస్ వరల్డ్ పోటీల నిర్వహణ తీరుపై మిస్ ఇంగ్లాండ్ మిల్లా మాగీ చేసిన ఆరోపణలపై రాష్ట్ర ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. సీనియర్ ఐపిఎస్ అధికారి షికా గోయల్, రమా రాజేశ్వరి, సైబరాబాద్ డిసిపి సాయిశ్రీ ఆధ్వర్యంలోని కమిటీ విచారణ చేపట్టింది. మిస్ వరల్డ్ కంటిస్టెంట్‌లను అడిగి పోటీల నిర్వహణ తీరు, ఏమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారా? మిస్ ఇంగ్లాండ్ మిల్లా మాగీ ఆరోపణల్లో ఏ మేరకు నిజం ఉందన్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. వీడియోలను సైతం రికార్డు చేశారు. పోటీదారులతోపాటు మిస్ వరల్డ్ సిఇఒ జూలియా మోర్లీ, పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ నుంచి సైతం పోటీల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మిల్లా మాగీ పాల్గొన్న డిన్నర్‌లో ఎవరెవరు పాల్గొన్నారు, ఆ రోజు ఆమెతో కూర్చున్న వారి పేర్లతోపాటు పూర్తి వివరాలు సేకరించారు. త్వరలో పూర్తి వివరాలతో ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నారు.

ఇంగ్లాండ్ వెళ్లిన తర్వాతే .....

మే మొదటి వారంలో జరిగిన మిస్ వరల్డ్ ఈవెంట్లలో హుషారుగా పాల్గొన్న మిల్లా మాగి తెలంగాణ ఆతిథ్యం తనకు బాగా నచ్చిందని చెప్పారు. ఆ తర్వాత తన తల్లి ఆరోగ్యం బాగాలేదని నిర్వాహకులకు తెలపడంతో ఆమెను మే 16న ఇంగ్లాండ్‌కు పంపించారు. అక్కడికెళ్లిన తర్వాత ప్రఖ్యాత సన్ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్‌పై సంచలన ఆరోపణలు చేశారు. తనను వేశ్య కంటే అధ్వాన్నంగా చూశారని ఆరోపించారు. ధనవంతులైన పురుష స్పాన్సర్లను అలరించాలనడంతో ఎంతో ఒత్తిడికి గురయ్యాన పేర్కొన్నారు. ఈ క్రమంలో మనస్తాపంతో హైదరాబాద్ నుంచి తిరిగొచ్చానని చెప్పారు.

ఆరోపణలు అవాస్తవం: జయష్ రంజన్

మిస్ ఇంగ్లాండ్ మిల్లా మాగి ఆరోపణలు అవాస్తవమని పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ అన్నారు. ఆమెను వేశ్యలా చూశారని చేసిన వ్యాఖ్యలను ఆయన కొట్టిపారేశారు. "తెలంగాణ ఆతిథ్యం నచ్చిందని చెప్పారు. తల్లి ఆరోగ్యం బాగోలేదని పోటీ నుంచి తప్పుకున్నారు. ఆమె పట్ల ఎవరు తప్పుగా ప్రవర్తించలేదు. మిస్ వరల్డ్ నిర్వాహకులతో మాట్లాడి పూర్తి వివరాలు తెలుసుకున్నాను. ఆమె కేవలం చౌమహల్లా ప్యాలస్ డిన్నర్‌లో మాత్రమే పాల్గొంది. ప్రతి టేబుల్‌లో పురుషులు, మహిళలు అందరూ ఉన్నారు. ఆమెతోటి పోటీదారులను కూడా విచారించాం" అని జయేష్ చెప్పారు.

నీల మేఘ శ్యామా నృత్య రూపకం మనోహారం



ప్రజాశక్తి కల్చరల్

నీల మేఘ శ్యామా రారా అంటూ నర్తకులు హవ భావ యుక్తం గా లలిత పద ముద్రలు లయ బంధం వేస్తూ ప్రేక్షకులను ముగ్ధలను చేశారు సుమధుర ఆర్ట్స్ అకాడమీ నిర్వహణలో రవీంద్ర భారతి ప్రధాన వేదిక పై శ్రావ్య మానస శిష్య బందం వేసవి శిక్షణ శిబిరం ముగింపు సందర్భం గా శ్రీ కష్ణ కర్ణా మతం లోని తరంగాలు ను నత్య రూపకం గా ప్రశ్నించారు బాల కష్ణుని చిలిపి అల్లరి పనులు లీలను కన్నుల పండుగగా ప్రదర్శించారు ఏడువందల మంది నర్తకులు లయబద్ధం గా ప్రదర్శించటం విశేషం. శిల్పారామం ప్రత్యేక అధికారి కిషన్ రావు స్టేట్ ఆర్ట్స్ గాలరీ డైరెక్టర్ డాక్టర్ లక్ష్మి పలువురు సినీ టి వీ ప్రముఖులు శ్రావ్య మానస ను శిష్యులు ను అభినందించారు జర్నలిస్ట్ రవి కుమార్ సినీ నటులు శ్రీనివాస్ భోగిరెడ్డి వ్యాఖ్యానం సందర్భోచితంగా వుంది.

సీనియర్ జర్నలిస్టు మునీర్ మృతి

• టిడబ్ల్యుజెఎఫ్, హెచ్‌యుజె సంతాపం





అంతిమ యాత్రలో పాల్గొన్న టిడబ్ల్యుజెఎఫ్ నాయకులు

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

సీనియర్ జర్నలిస్టు, కాలమిస్టు మునీర్ ఆదివారం మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో చికిత్స పొందుతున్న ఆయన మందమర్రిలోని నివాసంలో తుదిశ్వాస విడిచారు. ఆయన మృతి పట్ల టిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర కమిటీ, హెచ్‌యుజె, ఫెడరేషన్ ఖమ్మం జిల్లా కమిటీ ఆదివారం ఓ ప్రకటనలో సంతాపం ప్రకటించాయి. ప్రజా సమస్యలపై, జాతీయ, అంతర్జాతీయ పరిణామాలపై, సింగరేణి కార్మికుల ఇబ్బందులపై మునీర్ పనిచేశారు. దేశంలో ఏ మారుమూలన ప్రజలకు అన్యాయం జరిగినా తన కలంతో ప్రభుత్వాల తీరును ఎండగట్టేవారు. సింగరేణి ప్రాంతంలో దిక్కుమొక్కులేని జనం మునీర్ మృతితో ఓ పెద్ద దిక్కును కోల్పోయినట్టయింది. ప్రజల కోసం, తెలంగాణ కోసం నిలబడి మునీర్ కొట్లాడారు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో భాగంగా హైదరాబాద్ ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో పది వేల మంది జర్నలిస్టులతో నిర్వహించిన సభకు ఆయన అధ్యక్షత వహించారు. తెలంగాణ ఉద్యమంలో సింగరేణి జెఏసి చైర్మన్‌గా పనిచేశారు. ఆంధ్రజ్యోతి పత్రికలో కోల్ బెల్ట్ బ్యూరో చీఫ్‌గా వ్యవహరించారు. హక్కుల సాధన కోసం సింగరేణి ఉద్యోగాన్ని సైతం వదులుకున్నారు. 'న్యూస్ ఈజ్ పీపుల్...పీపుల్స్ ఆర్ మై లైఫ్' అనే సరికొత్త నినాదాన్ని ఎత్తుకున్న మునీర్. లేకపోవడం జర్నలిస్టు లోకానికి తీరని లోటని టిడబ్ల్యుజెఎఫ్ పేర్కొంది. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపింది.

మిస్ ఇంగ్లాండ్ మాగి ఆరోపణలపై విచారణ జరపాలి : కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మిస్ ఇంగ్లాండ్ మిల్లా మాగి ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఎక్స్ వేదికగా స్పందించారు. "మిస్ వరల్డ్ లాంటి అంతర్జాతీయ వేదికలపై మహిళల పట్ల వివక్షాపూరిత ఆలోచనలు ఉన్న మెంటాలిటీనీ ఎదిరించడానికి చాలా ధైర్యం కావాలి. తెలంగాణలో మీరు ఇలాంటి అనుభవాన్ని ఎదుర్కొన్నందుకు మేం చింతిస్తున్నాం. ఇక్కడ మహిళలను గౌరవించే గొప్ప సంస్కృతి ఉంది. మహిళలను పూజిస్తాం, గౌరవిస్తాం, వారి అభివృద్ధికి సమాన అవకాశాలను కల్పిస్తాం. రాణి రుద్రమ, చిట్యాల ఐలమ్మ వంటి గొప్ప నాయకులు మా తెలంగాణ మట్టిలో పుట్టినవారే" అని కెటిఆర్ తన ఎక్స్ ఖాతాలో పేర్కొన్నారు. మీరు ఎదుర్కొన్న ఈ చేదు అనుభవం నిజమైన తెలంగాణను ప్రతిబింబించేది కాదని అన్నారు.

ఏ ఒక్క మహిళ గాని, ఆడపిల్ల గానీ ఇలాంటి భయానక అనుభవాలను ఎదుర్కోకూడదని, ఒక అమ్మాయికి తండ్రిగా మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని పేర్కొన్నారు. బాధితురాలిని విమర్శించడం, ఆమెను తప్పుగా చూపించడం మాని ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని కోరారు.

డిసెట్‌కు 77.54 శాతం హాజరు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

డిప్లొమ ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డిఇఇడి), డిప్లొమ ఇన్ ప్రీస్కూల్ ఎడ్యుకేషన్ (డిపిఎస్ఇ)లో 2025-27 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం ఆదివారం డీసెట్-2025 రాతపరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఈ మేరకు డీసెట్ కన్వీనర్, ఎస్‌సిఇఆర్‌టి డైరెక్టర్ జి రమేష్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. తెలుగు మాధ్యమానికి 19,900 మంది దరఖాస్తు చేయగా, 15,476 (77.77 శాతం) మంది అభ్యర్థులు హాజరయ్యారని వివరించారు. ఇంగ్లీష్ మాధ్యమానికి 22,051 మంది, ఉర్దూ మాధ్యమానికి 1,664 మంది కలిపి 23,715 మంది దరఖాస్తు చేస్తే 18,345 (77.36 శాతం) మంది అభ్యర్థులు పరీక్ష రాశారని తెలిపారు. డీసెట్‌కు మొత్తం 43,615 మంది అభ్యర్థులు దరఖాస్తు చేయగా, 33,821 (77.54 శాతం) మంది పరీక్షకు హాజరయ్యారని పేర్కొన్నారు. డీసెట్ ప్రాథమిక కీని ఈ నెల 28న విడుదల చేస్తామని తెలిపారు. ఇతర వివరాల కోసం www.deecet. cdse. telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. డీసెట్ - 2023కు 6,485 మంది దరఖాస్తు చేస్తే 5,150 (79.41 శాతం) మంది అభ్యర్థులు హాజరయ్యారు. డీసెట్ - 2024కు 17,655 మంది దరఖాస్తు చేయగా, 15,150 (85.81 శాతం) మంది అభ్యర్థులు పరీక్ష రాశారు. ఈ ఏడాది డీసెట్‌కు గతం కంటే ఎక్కువ మంది దరఖాస్తు చేసిన విషయం తెలిసిందే.



సిపిఎస్‌ను రద్దు చేయాలి

• ఎఐఎఫ్‌టిఒ జాతీయ కార్యవర్గ సమావేశంలో ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సిపిఎస్)ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం (ఓపిఎస్)ను పునరుద్ధరించాలని ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ టీచర్స్ ఆర్గనైజేషన్స్ (ఎఐఎఫ్‌టిఒ) జాతీయ కార్యవర్గ సమావేశం ఆదివారం జార్ఖండ్‌లో దేవగఢ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఎస్ రద్దు కోసం ఎఐఎఫ్‌టిఒ మరింత బలోపేతం కావాలని చెప్పారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లోని ఉపాధ్యాయ సంఘాలను ఒక్కతాటిపైకి తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌టియుటిఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుండు లక్ష్మణ్, పుల్గం దామోదర్‌రెడ్డి, ఎఐఎఫ్‌టిఒ బాధ్యులు గీత, త్రివేణి, విజయలక్ష్మితోపాటు దేశంలోని పలు రాష్ట్రాల ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పేదలు సంఘటితం కావాలి

• ప్రజా సమస్యలపై ఐక్య ఉద్యమాలు చేపట్టాలి
• ఎర్రజెండాతో పెట్టుకుంటే కాలగర్భంలో కలిసిపోతారు
• ఆదివాసీల సంపద కొల్లగొట్టేందుకే ఆపరేషన్ కగార్
• సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ప్రజా సమస్యల పరిష్కారం కోసం పేదలు సంఘటితం కావాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ పిలుపునిచ్చారు. జనగామ జిల్లా బచ్చన్నపేట మండల కేంద్రంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు, జనగామ నియోజకవర్గ మొట్టమొదటి శాసనసభ్యులు గంగసాని(గొబ్బెట) గోపాల్ రెడ్డి స్మారక స్థూపాన్ని జాన్‌వెస్లీ ఆవిష్కరించారు. అనంతరం గోపాల్‌నగర్ చౌరస్తా నుంచి బచ్చన్నపేట చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ సెంటర్ వద్ద గోపాల్‌నగర్ శాఖ కార్యదర్శి పర్వతం నరసింహులు అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభలో జాన్ వెస్లీ మాట్లాడారు. నాడు సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో గోపాల్‌రెడ్డి కీలక భూమిక పోషించారని తెలిపారు. ఎర్రజెండా నాయకత్వంలో తెలంగాణ ప్రాంతంలో భూస్వాముల భూములు గుంజుకొని పది లక్షల ఎకరాల భూమిని పేదలకు అందించిన చరిత్ర ఎర్రజెండాదని అన్నారు. ఆంధ్ర మహాసభలో గోపాల్‌రెడ్డి సభ్యునిగా ఉండి బచ్చన్నపేట ప్రాంతంలో ఇళ్ల స్థలాలు, సాగు భూములు పంచి పెట్టిన గొప్ప మహానేత అని కొనియాడారు. జనగామ నియోజకవర్గానికి మొట్టమొదటి శాసనసభ్యులుగా ఎన్నికై జనగామ ప్రాంత ప్రజలకు ఎనలేని సేవలు అందించినట్టు చెప్పారు. దోపిడీ ఉన్నంతకాలం ఎర్రజెండా ప్రజల కోసం పోరాటాలు నిర్వహిస్తూనే ఉంటుందన్నారు. ఎర్రజెండాతో పెట్టుకున్న వారు కాలగర్భంలో కలిసిపోయిన ఘటనలు అనేకం ఉన్నాయని తెలిపారు. రాబోయే కాలమంతా ఎర్ర జెండా రాజ్యమేనని అన్నారు. నాటి అమరవీరుల త్యాగాలను, వారి పోరాట స్ఫూర్తిని భావితరాలకు అందించడం కోసమే ఇలాంటి స్థూపాలు నెలకొల్పుతున్నట్టు చెప్పారు. పేదరిక నిర్మూలన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి కార్యక్రమాలు చేపట్టడం లేదన్నారు. పేదరికం తొలగిపోవాలంటే ప్రభుత్వాలు విద్యా, వైద్యం, ఉపాధి అవకాశాలు కల్పించాలని తెలిపారు. కల్లబొల్లి మాటలు చెప్పి అధికారంలోకొచ్చిన ప్రభుత్వాలు స్వార్థం కోసం పాలన సాగిస్తూ దేశ సంపదను దోచుకుంటున్నారని అన్నారు. ఆపరేషన్ కగారి పేరిట కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం హత్యాకాండను కొనసాగిస్తున్నదని జాన్‌వెస్లీ అన్నారు. అడవిలో ఉన్న వనరులను కొల్లగొట్టేందుకే ఈ ఆపరేషన్ కగార్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రజలంతా సంఘటితమై సమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు.సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండీ అబ్బాస్ మాట్లాడుతూ.. ఆపరేషన్ కగార్ పేరుతో అటవీ సంపదను ఆదానీ, అంబానీలకు కట్టబెట్టేందుకు బిజెపి ప్రభుత్వం యత్నిస్తున్నదని అన్నారు. ఆదివాసీలపై అకారణంగా కాల్పులు జరుపుతూ ఎన్‌కౌంటర్ల పేరుతో గిరిజనులు, ఆదివాసులను పొట్టన పెట్టుకుంటున్నదని విమర్శించారు. ఇప్పటికైనా ఆపరేషన్ కగారును వెంటనే నిలిపివేయాలని, ఆదివాసుల భూములను రక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి రాజు, ఇర్రి అహల్య, బొట్ల శేఖర్, బచ్చన్నపేట మండల ఇన్‌చార్జి సుంచు విజేందర్, జిల్లా కమిటీ సభ్యులు జోగు ప్రకాష్, మండల కార్యదర్శి బెల్లంకొండ వెంకటేష్, జిల్లా కమిటీ సభ్యులు ఎండీ షబానా, జిల్లా నాయకులు గుండె బోయిన రాజు, మండల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

వేడుకగా తెలంగాణ చెఫ్స్ అసోసియేషన్ వార్షికోత్సవం

ప్రజాశక్తి - హైదరాబాద్

తెలంగాణ చెఫ్స్ అసోసియేషన్ ఆరో వార్షికోత్సవం, క్యులినరీ కాన్క్లేవ్ 2025ను ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ కలినరీ అసోసియేషన్ (ఐఎఫ్‌సిఎ) అధ్యక్షుడు చెఫ్ మంజీత్ సింగ్ గిల్ ప్రారంభించారు. హైదరాబాద్‌లో దీనిని తెలంగాణ చెఫ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'రూట్స్ టు రోబోట్స్ - ది ఎవల్యూషన్ ఆఫ్ క్యులినరీ క్రాఫ్ట్' అనే థీమ్‌తో నిర్వహించారు. ఈ సందర్భంగా మంజీత్ సింగ్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఉన్న సంప్రదాయ వంటలను పరిరక్షించడం, ప్రతి కిచెన్లో, ప్రతి విందులో, ప్రతి అతిథి అనుభవంలో కొత్త దనం, నైపుణ్యం తీసుకురావడమే లక్ష్యమన్నారు. మన వంటకం మన ప్రత్యేకతని, దానిని సంరక్షించాలని చెప్పారు. తెలంగాణ చెఫ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చెఫ్ ధర్మేంద్ర లాంబా మాట్లాడుతూ ఈ ఈవెంట్ ఒక వేడుక మాత్రమే కాదని, భవిష్యత్తుకు సిద్ధమైన క్యులినరీ సమాజాన్ని నిర్మించేందుకు ఇది ఒక ఉద్యమం అన్నారు.

కెసిఆర్‌ను జీవ సమాధి చేసే ప్రయత్నం : జగ్గారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్ అధినేత కెసిఆర్‌ను జీవ సమాధి చేసే ప్రయత్నం చేస్తున్నారని టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి ఆరోపించారు. ఆదివారం గాంధీభవన్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత లేఖలో బీఆర్ఎస్ పార్టీలో కోవర్టులు ఉన్నారని చేసిన వ్యాఖ్యలు కలకలం రేపుతున్నాయని చెప్పారు. కవిత నిరాశలో రాసిన లేఖతో కాంగ్రెస్‌కు వచ్చిన ఇబ్బందేమి లేదనీ, ఆమె చర్యలు బీజేపీకి ప్రాధాన్యం పెంచుతున్నాయని విమర్శించారు. బీఆర్ఎస్ ను చంపడం, బతికించుకోవడం వారి వ్యక్తిగతమనీ, ఆమె లేఖతో బీఆర్ఎస్ ఓటు బ్యాంకు గలిబిలికి గురైందన్నారు. కవిత ఆమె తండ్రి వల్లే నాయకురాలైందనీ, నేరుగా కాదనీ, ఆమె రాజకీయంగా బలవంతురాలు కాదని కొట్టిపారేశారు. రాష్ట్ర విభజన కోణంలో కేసీఆర్ పట్టం కట్టిన ప్రజలు, అభివృద్ధి కోరుకుని కాంగ్రెస్‌ను గెలిపించారని తెలిపారు.

ఇ సెట్‌లో 17,768 మంది ఉత్తీర్ణత

- అర్హత పొందిన వారిలో అమ్మాయిలే అధికం
- ఫలితాలు విడుదల చేసిన బాలకిష్టారెడ్డి


ఫలితాలు విడుదల చేస్తున్న ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి, ఒయు విసి కుమార్ మొలుగారం, తదితరులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో బిటెక్, బిఇ, బి ఫార్మసీ, బిఎస్‌సి మ్యాథమెటిక్స్ కోర్సుల్లో 2025-26 విద్యా సంవత్సరంలో ద్వితీయ సంవత్సరంలో లాటరల్ ఎంట్రీ ద్వారా ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఇసెట్ రాతపరీక్ష ఫలితాలను ఆదివారం హైదరాబాద్ ఉన్నత విద్యామండలి చైర్మన్ వి బాలకిష్టారెడ్డి, ఒయు విసి కుమార్ మొలుగారం విడుదల చేశారు. ఈ నెల 12న ఈసెట్ పరీక్షకు రాష్ట్ర వ్యాప్తంగా 19,672 మంది అభ్యర్థులు దరఖాస్తు చేయగా, 18,928 (96.22 శాతం) మంది హాజరయ్యారు. వారిలో 17,768 (93.87 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. 11,835 మంది అబ్బాయిలు పరీక్షలు రాయగా, 10,972 (92.71 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. 7,093 మంది అమ్మాయిలు పరీక్షలు రాస్తే, 6,796 (95.81 శాతం) మంది ఉత్తీర్ణత పొందారు. ఈసెట్ ఫలితాల్లోనూ అమ్మాయిలే పైచేయి సాధించారు. అబ్బాయిల కన్నా అమ్మాయిలు 3.1 శాతం మంది అధికంగా ఉత్తీర్ణత సాధించారు. 11 కోర్సుల్లో ప్రవేశాలకు ఇసెట్ రాతపరీక్షను నిర్వహించారు. అత్యధికంగా ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ (ఇసిఇ) విభాగానికి 5,336 మంది దరఖాస్తు చేయగా, 5,138 మంది పరీక్ష రాశారు. వారిలో 4,774 (92.92 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (సిఎస్ఇ)కి 4,879 మంది దరఖాస్తు చేస్తే, 4,728 మంది పరీక్ష రాశారు. వారిలో 4,522 (95.64 శాతం) మంది ఉత్తీర్ణత పొందారు. ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ (ఇఇఇ) విభాగానికి 4,201 మంది దరఖాస్తు చేస్తే, 4,053 మంది పరీక్షకు హాజరయ్యారు. వారిలో 3,719 (91.76 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. సివిల్ ఇంజినీరింగ్‌కు 2,578 మంది దరఖాస్తు చేయగా, 2,477 మంది పరీక్షకు హాజరయ్యారు. వారిలో 2,389 (96.45 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. మెకానికల్ ఇంజినీరింగ్‌కు 2,035 మంది దరఖాస్తు చేస్తే, 1,949 మంది అభ్యర్థులు పరీక్ష రాశారు. వారిలో 1,813 (93.02 శాతం) మంది ఉత్తీర్ణత పొందారు. అత్యల్పంగా బిఎస్‌సి మ్యాథమెటిక్స్ కోర్సుకు 30 మంది దరఖాస్తు చేయగా, పది మంది పరీక్ష రాశారు. వందశాతం ఉత్తీర్ణత పొందారు. ఈ కార్యక్రమంలో ఒయు విసి కుమార్ మొలుగారం, ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ఇటిక్యాల పురుషోత్తం, కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్, ఒయు రిజిస్ట్రార్ నరేష్‌రెడ్డి, ఇసెట్ కన్వీనర్ పి చంద్రశేఖర్, ఎస్‌బీటెట్ ఇన్‌చార్జీ బి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

లీజు క్వార్టర్లపై సమీక్షిస్తాం : కుమార్

ఒయులో రెండు క్వార్టర్లను గతంలో లీజుకిచ్చారని, తాను ఇవ్వలేదని విసి ఎం కుమార్ చెప్పారు. వాటిపై సమీక్ష నిర్వహిస్తామని అన్నారు. త్వరలోనే పూర్తి వివరాలను వెల్లడిస్తామన్నారు. ఏటా ఒయు స్నాతకోత్సవం నిర్వహిస్తామని చెప్పారు. తాను వచ్చాక ఫీజులను పెంచలేదన్నారు. ఒయు ఇంజనీరింగ్ కాలేజీల్లో ఎమర్జింగ్ కోర్సులను ప్రవేశపెడుతున్నామని అన్నారు. రాష్ట్రంలో వచ్చేనెల 15 నుంచి ఈసెట్ ప్రవేశాలకు కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను విడుదల చేస్తామని ఉన్నత విద్యామండలి చైర్మన్ వి బాలకిష్టారెడ్డి అన్నారు.

ఈసెట్ ఫలితాల వివరాలు

	దరఖాస్తు	హాజరు	ఉత్తీర్ణత	శాతం
అబ్బాయిలు	12,326	11,835	10,972	92.71
అమ్మాయిలు	7,346	7,093	6,796	95.81
మొత్తం	19,672	18,928	17,768	93.87

ఈసెట్ ర్యాంకర్ల వివరాలు

కోర్సు	టాపర్‌పేరు	జిల్లా
1. బిఎస్‌షి (మ్యాథమెటిక్స్)	బి సంతోష్‌కుమార్	మేడ్చల్ మల్కాజిగిరి
2. కెమికల్ ఇంజనీరింగ్	లెంక తేజసాయి	విశాఖపట్నం (ఏపీ)
3. సివిల్ ఇంజనీరింగ్	గోల్కొండ నిఖిల్ కౌశిక్	జయశంకర్ భూపాలపల్లి
4. సిఎస్ఇ	కె శ్రీకాంత్	నారాయణపేట
5. ఇఇఇ	కాసుల శ్రావణి	హన్మకొండ
6. ఇసిఇ	కాట్లే రేవతి	సిద్ధిపేట
7. ఇఐఇ	రాపర్తి చందన	జగిత్యాల
8. మెకానికల్ ఇంజనీరింగ్	పోతుగంటి కార్తీక్	పెద్దపల్లి
9. మెటలర్జికల్ ఇంజనీరింగ్	తోట సుబ్రహ్మణ్యం	కాకినాడ (ఎపి)
10. మైనింగ్ ఇంజనీరింగ్	కుర్మ అక్షయ	పెద్దపల్లి
11. ఫార్మసీ	అయిలి చందన	హన్మకొండ

ప్రభుత్వ బడులను ప్రజలే కాపాడుకోవాలి

- టిపిఎస్‌వి ఆధ్వర్యంలో ప్రచార జాతా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ బడులను ప్రజలే కాపాడుకోవాలనే సందేశంతో తెలంగాణ పౌర స్పందన వేదిక (టిపిఎస్‌వి) ఆధ్వర్యంలో సోమవారం నుంచి ప్రచారజాత ప్రారంభం కానుంది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం రాధేశ్యాం ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. నల్లగొండ పట్టణంలో సోమవారం ఉదయం తొమ్మిది గంటలకు ప్రారంభిస్తామని తెలిపారు. ఉమ్మడి నల్లగొండ, మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల్లో ఈనెల 29 వరకు నాలుగు రోజులపాటు ఈ ప్రచార జాతా కొనసాగుతుందని పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో ముగింపు ఉంటుందని వివరించారు. అంతరాలు లేని బడి కోసం అందరూ మాట్లాడాలని కోరారు. విద్యా, వైద్యం ప్రభుత్వ బాధ్యత అని తెలిపారు. ప్రభుత్వ బడులు నిలబడాలనీ, చదువుల్లో అంతరాలు పోవాలని పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో నర్సరీ, ఎల్‌కేజీ, యుకెజి తరగతులను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. అంతరాలు విద్య కోసం ప్రజలందరూ కదలాలని కోరారు. అప్పుడే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ బడులను బాగు చేస్తాయని పేర్కొన్నారు. అందరికీ నాణ్యమైన, సమానమైన విద్య ఉచితంగా అందుతుందని తెలిపారు.



మిస్ వరల్డ్ పోటీదారులకు హానర్ హోమ్స్ ఆతిథ్యం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మిస్ వరల్డ్ పోటీలకు హైదరాబాద్ వచ్చిన సుందరీమణులకు ప్రముఖ సంస్థ హానర్ హోమ్స్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ సంప్రదాయ ఆదిథ్యం ఇచ్చింది. వెల్‌కమ్ గ్యాలరీ,కనెక్ట్ డిస్టినేషన్,హానర్ సిగ్నాటీస్ మోడల్ ఆపార్ట్‌మెంట్లు, విజన్ హబ్‌లను సుందరాంగులు సందర్శించారు. అక్కడే తెలంగాణ సంప్రదాయ వారసత్వాన్ని చాటిచెప్పేలా స్థానిక కళాకారులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనను వారు ఆస్వాదించారు. హానర్ మోమ్స్ మేనేజింగ్ డైరెక్టర్లు ఎస్ రాజమౌళి, పి వెంకటేశ్వర్లు,ఎం బాలు చౌదరి,వై స్వప్నకుమార్ అతిథులను సాదరంగా స్వాగతించారు. సంస్థ తరుపున మిస్ వరల్డ్ పోటీదారులకు వారు శుభాకాంక్షలు తెలిపారు.

జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ ఉత్సవాలు నిర్వహించాలి : బిఆర్ఎస్

హైదరాబాద్ బ్యూరో : తెలంగాణ సాధించిన పార్టీ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాలను ఘనంగా నిర్వహించాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. అందుకు మాజీ స్పీకర్ సిరికొండ మధుసుధనాచారి నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున కార్యక్రమాలను నిర్వహించాలని పిలుపునిచ్చింది. అమరవీరుల స్థూపం నుంచి అమరవీరుల స్మారక చిహ్నం వరకు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించాలని నిర్ణయించింది.

బిఆర్ఎస్‌లో 'కవిత' కల్లోలం

- ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కెసిఆర్, కెటిఆర్ తర్జనభర్జన
- తనదారి తాను చూసుకొనే పనిలో కవిత
- జూన్ 9న కొత్త పార్టీ ఆవిర్భావం?

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తన తండ్రి కెసిఆర్‌కు రాసిన లేఖ లీకుతో ప్రస్తుతం భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) కల్లోల పరిస్థితులను ఎదుర్కొంటోంది. మే2న రాసిన లేఖ ఇప్పుడు లీకు కావడంతో ఒకవైపు కెసిఆర్, కెటిఆర్, మరోవైపు కవిత కూడా ఆశ్చర్యాన్ని వ్యక్తం చేస్తున్నారు. అంతర్గతంగా పార్టీ అధ్యక్షుడికి రాసిన లేఖను మీడియాకు విడుదల చేయడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో పార్టీ అధ్యక్షులు కెసిఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఆదివారం ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో భేటీ అయ్యారు. ఇప్పుడీ అంశం రాజకీయ వర్గాల్లో హాట్ టాఫిక్‌గా మారింది. కవిత ఇటీవల చేసిన వ్యాఖ్యలు, తదనంతర పరిణామాలపై తండ్రి కొడుకుల మధ్య తీవ్రంగా చర్చ జరిగినట్టు సమాచారం. కవిత లేఖ, శంషాబాద్ విమానాశ్రయం వద్ద ఆమె వ్యాఖ్యల నేపథ్యంలో పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘన కింద షోకాజ్ నోటీసులు ఇవ్వాలా? వద్దా? అనే దానిపై ఇరువురూ మాట్లాడుకున్నారని ప్రచారం జరుగుతోంది. కవిత సొంత కుటుంబ సభ్యురాలు కావడంతో వేచి చూసే ధోరణిని అవలంభించాలని కేసీఆర్ అభిప్రాయపడినట్టు తెలిసింది. అలాగే జూన్ 2న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల నిర్వహణపైనా వారిద్దరూ చర్చించారు. అదే సమయంలో కెటిఆర్ అమెరికాలో జరిగే తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాల్లో పాల్గొనేందుకు వెళ్తున్నట్టు సమాచారం ఇచ్చారని తెలిసింది. పార్టీపై కవిత తిరుగుబాటు చేస్తున్న నేపథ్యంలో కేటీఆర్ ఆమెరికా పయనంపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అయితే, నెల రోజులకు ముందే అమెరికా ప్రయాణం ఖరారైందని ఆయన సన్నిహితులు చెప్తున్నారు.

లీకు వీరులు ఆ నలుగురే...

పార్టీ అధ్యక్షుడికి మే 2న లేఖ రాసిన విషయం వాస్తవమేనని స్వయంగా ఎమ్మెల్సీ కవిత ప్రకటించిన విషయం తెలిసిందే. కానీ లేఖను మీడియాకు లీకు చేసింది ఎవరనే దానిపై చర్చ జరుగుతోంది. 'ఆ నలుగురే' ఈ లీకుకు కారకులనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తమ కుటుంబ సభ్యులకంటే కెసిఆర్ చుట్టూ ఆ కోటరీ బలంగా పని చేస్తున్నదనే అసంతృప్తిలో కవిత ఉన్నారని సమాచారం. మాజీ ఎంపి జోగినపల్లి సంతోష్‌కుమార్, మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బేతి సుభాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డిల బృందంలో ఎవరో ఒకరు తన లేఖను లీకు చేశారని కవిత అనుమానపడుతున్నారని విశ్వసనీయ సమాచారం. పార్టీలో కోవర్టులుగా మారి ఇతర పార్టీలకు సహకరిస్తున్నారని ఇప్పటికే ఆమె ఆరోపించారు. రకరకాల సందర్భాల్లో కెటిఆర్, హరీశ్‌రావు పేర్లు మాత్రమే వినిపిస్తున్నాయనీ, పార్టీలో తన సేవలను గుర్తించడం లేదని ఆమె భావిస్తున్నారని తెలిసింది. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవిని తనకు ఇవ్వాలని చాలా కాలంగా కవిత కోరుతున్నట్టు తెలిసింది. ఈ విషయంలో పార్టీ అధిష్టానం కూడా ఉలుకూ, పలుకూ లేకుండా వ్యవహరిస్తుండటాన్ని ఆమె తప్పుపడుతున్నారని విశ్లేషకులు భావిస్తున్నారు.

జూన్ 9న కొత్త పార్టీ?

బిఆర్ఎస్‌తో కవిత తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధమవుతున్నట్టు సమాచారం. జూన్ 9న కవిత నేతృత్వంలో కొత్త పార్టీ ఆవిర్భవించబోతున్నట్టు పార్టీ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది. ఇప్పటికే పార్టీ జెండా కూడా సిద్ధమైనట్టు తెలిసింది. మెదక్, నిజామాబాద్ పార్లమెంటు నియోజకవర్గాల్లో బిజెపి విజయం సాధించడం వెనుక కెటిఆర్, హరీశ్‌రావు ఉన్నట్టు కవిత ప్రధానంగా ఆరోపిస్తున్నారు. దీనిపై ఎన్నోసార్లు అధిష్టానం దృష్టికి తీసుకెళ్లినా సమాధానం చెప్పలేదనే టాక్ వినిపిస్తోంది. కొంతకాలంగా బిఆర్ఎస్‌లో కవిత అంటీముట్టనట్టుగానే ఉంటున్నారు. సొంత అజెండా సిద్ధం చేసుకుని ముందుకెళ్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. లిక్కర్ కుంభకోణంలో జైలుకెళ్లొచ్చిన తర్వాత... ఆమెకు, కెటిఆర్‌కు మధ్య విభేదాలు తీవ్రస్థాయికి చేరాయని భావిస్తున్నారు. జైలు నుంచి వచ్చాక కవిత తన ఇంటినే రాజకీయ వేదికగా మార్చారు. బిసి రిజర్వేషన్లు, కులగణన, ఎస్‌సి వర్గీకరణ వంటి అంశాలపై స్పందించారు. రిజర్వేషన్లపై ధర్నా చౌక్ వద్ద బహిరంగ సభ నిర్వహించారు. పార్టీ వైఖరి ఏదైనా ఆమె మాత్రం బిసిలకు రిజర్వేషన్లపై తన గళాన్ని వినిపించారు. పార్టీతో సంబంధం లేకుండా పార్టీకి సమాంతరంగా ఆమె సొంతంగా కార్యక్రమాలు నిర్వహించారు. సందర్భం దొరికినప్పుడల్లా తన బలాన్ని చూపించే ప్రయత్నం చేశారు. పార్టీలో ఆమెకు సరైన ప్రాధాన్యం లేకపోవడం వల్లే సొంతంగా కార్యక్రమాలు చేపట్టారన్న అభిప్రాయాలూ వ్యక్తమవుతున్నాయి.

వృత్తులను ఆదుకుంటే..ఆధునిక భారతమే..

- చేతి వృత్తుల ఆధునీకరణ
- ప్రత్యామ్నాయం పుస్తకావిష్కరణలో వక్తలు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వాలు వృత్తులను ఆదుకుంటే ఆధునిక భారతాన్ని నిర్మిచవచ్చని వక్తలు చెప్పారు. ఆదివారం హైదరాబాద్‌లో వెనుకబడిన తరగతుల సాధికారత సంస్థ ఆధ్వర్యంలో 'చేతివృత్తుల ఆధునికరణ-ప్రత్యామ్నాయం' పుస్తకాన్ని బిసిసిఇ చైర్మన్, రాజ్యసభ మాజీ సభ్యులు టి దేవేందర్‌గౌడ్, హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఈశ్వరయ్య, విశ్రాంత ఆచార్యులు ప్రొఫెసర్ ఇ తిరుమలి, సీనియర్ జర్నలిస్టు ఇంద్రవెల్లి రమేష్ అవిష్కరించారు. ఈ సందర్భంగా జస్టిస్ ఈశ్వరయ్య మాట్లాడుతూ బిసిల అభివృద్ధికి పాలకులు తగిన విధంగా కృషి చేయడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచ నిరుపేదల్లో సగం మంది మన దేశంలోనే ఉన్నారంటూ వస్తున వార్తలు వింటుంటే విస్మయం కలుగుతుందని చెప్పారు. సంపన్నమైన దేశంలో సగం మంది ఎందుకు దరిద్రంతో ఉన్నారో ఆలోచించాలన్నారు. దేశానికి స్వతంత్రమొచ్చి ఏడు దశాబ్దాలైనా తక్కువ జనాభా కలిగిన కులాలు పాలిస్తున్నాయని, అందుకే ఎక్కువ జనాభా కలిగిన కులాల అభివృద్ధి ఎలా సాధ్యమని ప్రశ్నించారు. రాజకీయంగా గొప్ప వ్యాపారంగా మారిందని చెప్పారు.ప్రజాస్వామ్యంలో మానవత్వం లేకుండా పోతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. అసమానతలు అంతర్గత యుద్ధాలకు దారితీస్తాయని పరోక్షంగా పాలకులను హెచ్చరించారు. ప్రొఫెసర్ తిరుమలి మాట్లాడుతూ కులం అండ లేకుండా రాజకీయ పార్టీలు లేవన్నారు. రాజకీయాలకు పునాది కులమేనని చెప్పారు. కులగణన విషయంలో గత ప్రభుత్వమూ, ప్రస్తుత ప్రభుత్వమూ నిర్లక్ష్యం చేస్తున్నాయని తెలిపారు. జనాభా రిత్యా ఎక్కువగా ఉన్నప్పటికీ హుందాగా, గౌరవ జీవనం గడిపే పరిస్థితులు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. దేవేందర్ గౌడ్ మాట్లాడుతూ సమతుల్యత లోపించిన అభివృద్ధి, ప్రజల మధ్య పెరిగిపోతున్న ఆర్థిక అంతరాలు రాబోయే రోజుల్లో మరిన్ని విపరిణామాలకు దారితీస్తాయన్నారు. ఇదంతా ఒక్క బిసిల సమస్యే కాదని, దేశం సమస్య అని చెప్పారు.బిసిసిసి కార్యదర్శి ఇంద్రవెల్లి రమేష్ సంస్థ కార్యకలాపాలను వివరించారు.

మిస్ వరల్డ్ వేడుకలకు 'మెట్రో రైల్' విస్తృత ప్రచారం

- మెట్రో మూడు కారిడార్లలో స్టేషన్లు, స్తంభాలపై ఫ్లెక్సీలు



మెట్రో స్తంభాలతకు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న మిస్ వరల్డ్ వేడుకల్లో హైదరాబాద్ మెట్రో రైలు కూడా నేను సైతం అంటూ భాగస్వామ్యం అయ్యి విస్తృత ప్రచారం చేపట్టింది. తెలంగాణలోని వివిధ పర్యాటక ప్రాంతాల ప్రాశస్త్యాన్ని ప్రజలకు తెలియజేయడంతో పాటు ప్రపంచ సుందరీమణులను తెలంగాణకు పరిచయం చేసేలా అటు హైటెక్ సిటీ నుంచి నాగోల్ వరకు ఇటు మియాపూర్ నుంచి ఎల్‌బీ నగర్ వరకు పలు ప్రాంతాల్లో మెట్రో స్టేషన్లు, మెట్రో స్తంభాలు, రహదారులకు ఇరువైపులా ఉన్న మెట్రో రైలింగ్లపై ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. మెట్రో రైళ్లలో స్క్రీన్‌ల పైన, స్టేషన్ ప్లాట్‌ఫామ్‌లో కాన్ కోర్స్‌ల్లో ప్రకటనల బోర్డులపైనా మిస్ వరల్డ్ వేడుకలను ప్రతిబింబించేలా హైదరాబాద్ మెట్రో రైల్ సంస్థ విస్తృతంగా ప్రచారం చేపట్టింది. ఇక రహదారుల నుంచి స్టేషన్లలోకి వెళ్లే ప్రవేశ ద్వారం వద్ద సంప్రదాయ చిత్రాలతో కూడిన ఆర్చ్‌లను ఏర్పాటు చేసి ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాలకు మరింత వన్నె తెచ్చింది.

ప్రతిరోజూ దాదాపు 4.5 లక్షల నుంచి ఐదు లక్షల మంది ప్రయాణికులను తమ గమ్యస్థానాలకు మెట్రోరైల్ చేరవేస్తున్నదని, ఈ ప్రతిష్టాత్మకమైన మిస్ వరల్డ్ కార్యక్రమం ద్వారా తెలంగాణ వారసత్వ సంపదను నలుగురికీ తెలియజేసే బృహత్ కార్యక్రమంలో పాల్గొంటోందని మెట్రో ఎండి ఎన్‌విఎస్ రెడ్డి తెలిపారు. యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి ఆధ్యాత్మిక సంరంభం, పర్యావరణ పరిరక్షణకు ప్రతీకగా నిలిచిన అమ్రాబాద్ పులుల అభయారణ్యం, ఐక్యరాజ్యసమితి గుర్తించిన వారసత్వ ప్రాంగణం రామప్ప దేవాలయం, తెలంగాణ సంప్రదాయాలకు కీర్తి పతాకగా నిలిచిన బోనాలు, బతుకమ్మ, చార్మినార్ వంటి విశేషాలతో కూడిన ఆకర్షణీయ దృశ్యాలను 'మెట్రో రైల్' ఈ వేడుకల సందర్భంగా మరింత విస్తృత ప్రచారం కల్పించిందని మెట్రో ఎండి తెలిపారు.

బెంగళూరు హైవేపై ఘోర రోడ్డు ప్రమాదం

- పెట్రోలింగ్ పోలీసులను ఢీ కొట్టిన లారీ
- హెడ్ కానిస్టేబుల్ మృతి, మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రోడ్డు ప్రమాదం జరిగిందని తెలుసుకుని ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ప్రమాదానికి గురైన లారీని పక్కకు తప్పిస్తూ.. ట్రాఫిక్ సరిదిద్దుతున్న సమయంలో అక్కడికి వేగంగా వచ్చిన మరో లారీ పోలీసులను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఒక పోలీసు మృతి చెందారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ విషాదకర ఘటన రంగారెడ్డి జిల్లా శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. గతంలో ఎన్నడూ లేని విధంగా విధులు నిర్వహిస్తున్న పోలీసులే రోడ్డు ప్రమాదంలో మరణించడం కలకలం రేపింది. స్టేషన్ హౌస్ ఆఫీసర్ కె నరేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం రాత్రి 9: 40 గంటలకు బెంగళూరు జాతీయ రహదారి - 44 పెద్ద షాపూర్ గ్రామం వద్ద రోడ్డు ప్రమాదం జరిగిందని పెట్రోలింగ్ మొబైల్-1 నుంచి 100 డయల్‌కు కాల్ వచ్చింది. విషయం తెలుసుకున్న స్థానిక పెట్రోలింగ్ మొబైల్-1 సిబ్బంది హెడ్ కానిస్టేబుల్స్ డి విజయ్‌కుమార్ (40), డి చెన్నయ్య అక్కడికి చేరుకున్నారు. వారితోపాటు హైవే ట్రాఫిక్ మొబైల్-2 సిబ్బంది యాదయ్య డ్రైవర్ ఇ శ్రీనివాస్ కూడా అక్కడ ట్రాఫిక్ క్లియరెన్స్ కోసం వచ్చారు. ముందుగా ప్రమాదానికి గురైన లారీని పక్కకు తప్పించి ట్రాఫిక్ సరిదిద్దుతున్న సమయంలో రాత్రి 10 :45 గంటలకు కర్ణాటక నుంచి వస్తున్న ఒక లారీ అతివేగంగా, అజాగ్రతగా రావడంతో ట్రాఫిక్ క్లియర్ చేస్తున్న పోలీసులను ఢీ కొట్టింది. ఈ ఘటనలో హెడ్‌కానిస్టేబుల్ విజయ్‌కుమార్ అక్క డికక్కడే మృతి చెందారు. యాదయ్య, శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలయ్యాయి. విజయ్‌కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. గాయపడ్డ వారిని నగరంలోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అధికార లాంఛనాలతో అంత్యక్రియలు

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కానిస్టేబుల్ విజయ్‌కుమార్ అంత్యక్రియలను ఆదివారం అధికార లాంఛనాలతో నిర్వహించారు. షాబాద్ మండల పరిధిలోని కుర్వగూడ గ్రామంకు చెందిన విజయ్‌కుమార్.. శంషాబాద్ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన మృతి వార్త తెలుసుకున్న శంషాబాద్ జోన్ డిసిపి రాజేష్, ఎసిపి శ్రీకాంత్‌గౌడ్, సిఐ నరేందర్‌రెడ్డి.. మృతుని స్వగ్రామం కుర్వగూడలో జరిగిన అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

మరో ప్రమాదంలో యువకుడు మృతి

కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన మరో రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందారు. కందుకూరు సిఐ సీతారాం తెలిపిన వివరాల ప్రకారం.. కందుకూరు మండలం బేగంపేట గ్రామం గాజుల బురుజు తండాకు చెందిన రామావత్ సింగ్ (24) శనివారం సాయంత్రం తన బైక్‌పై కూరగాయలు తీసుకురావడానికి బేగంపేట గ్రామానికి వచ్చాడు. కూరగాయలు తీసుకొని తిరిగి ఇంటికి వెళ్తుండగా.. ఆంజనేయ స్వామి దేవాలయం ఆవరణలో అతివేగంతో వచ్చిన లారీ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందారు. లారీ డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగినట్టు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కాళేశ్వరం మరమ్మతుల ఖర్చు ప్రభుత్వం భరిస్తుందా?

- ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాళేశ్వరం ప్రాజెక్టు పునరుద్ధరణ, మరమ్మతుల ఖర్చు ప్రభుత్వం భరిస్తుందా? అనే దానిపై సాగు నీటి శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టతనివ్వాలని బిజెపి చీఫ్ విప్ డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై ఒకవైపు చర్చ జరుగుతుంటే సందట్లో సడేమియా అన్నట్టు గుత్తేదారు సంస్థలు కాళేశ్వరం పునరుద్ధణ ఖర్చంతా ప్రభుత్వమే భరించాలని లేఖ రాయడం పలు అనుమానాలకు తావిస్తోందని పేర్కొన్నారు. బ్యారేజీలపై ఎన్‌డిఎస్ఎ సిఫారసుల ప్రకారం పరీక్షలు నిర్వహిస్తే రూ.40 కోట్ల వరకు ఖర్చు కావచ్చని, వాటన్నింటిని కూడా ప్రభుత్వమే ఖర్చుచేయాలని గుత్తేదారులు కోరడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి కక్కిస్తామని, రికవరీ చేస్తామని సిఎం రేవంత్‌రెడ్డి చెప్పిన మాటలు ఏమయ్యాయని ప్రశ్నించారు. అన్నారం, సుందిళ్లలో ఫైనల్ బిల్లు రూ.176 కోట్లు, ఎన్‌డిఎస్ఎ సిఫార్సుల మేరకు చేసిన పనులకు రూ.4.5 కోట్లు, బ్యాంకు గ్యారంటీ మొత్తం రూ.43 కోట్లు కూడా ఇవ్వాలని గుత్తేదారు సంస్థ కోరినట్టు పత్రికల్లో వార్తా కథనాలు వచ్చాయని గుర్తుచేశారు. కాళేశ్వరంలోని ఏడో బ్లాక్ పునర్నిర్మాణం, సుందిళ్ల, అన్నారం బ్యారేజీల మరమ్మతుల కోసం ఎన్‌డిఎస్ఎ నివేదిక ప్రకారం పనులు చేస్తే దాదాపు రూ.పది వేల కోట్లు అదనంగా ఖర్చయ్యే అవకాశం ఉందని, ఈ ఖర్చు మొత్తం ప్రభుత్వమే భరిస్తుందా? అని ప్రశ్నించారు. మేడిగడ్డ బ్యారేజ్ ఫైనల్ బిల్లును చెల్లించకూడదని, కాళేశ్వరం పునరుద్ధరణ జరిగే వరకు ఆపాలని సూచించారు.

కరోనా.. ఎంత మాత్రం మహమ్మారి కాదు

- కేసులు పెరిగినా ఆందోళన చెందొద్దంటున్న డాక్టర్లు
- ఏర్పాట్లు చేస్తున్న ప్రభుత్వం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మళ్లీ కరోనా కేసులు పెరుగుతున్నాయి. గత కొంత కాలంగా ప్రపంచంలోని కొన్ని దేశాల్లో వెలుగు చూసిన ఈ వైరస్ ఇటీవల మన దేశంలోనూ కేసులు వెలుగు చూస్తున్నాయి. దీంతో మరోసారి కోవిడ్ మహమ్మారిగా మారుతుందా? లాక్ డౌన్ పెడతారా? పరిస్థితి ఏ విధంగా ఉండబోతుంది? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. గతంలో కోవిడ్ వచ్చిన సమయంలో ఎక్కువగా దీర్ఘకాలిక రోగాలు కలిగిన వారిపై ప్రభావం చూపించింది. మరణించిన వారిలో కూడా కరోనాతో పాటు ఇతర రోగాలున్న వారే ఎక్కువగా ఉన్నారు. దశల వారిగా రకరకాల వేరియంట్ల రూపంలో కొంత కాలం ఆగుతూ మళ్లీ కొత్త వేరియంట్ల రూపంలో వచ్చిన సంగతి తెలిసిందే. తాజాగా హైదరాబాద్ కూకట్ పల్లిలో ఒక డాక్టర్ సోకడంతో తెలంగాణలోనూ కరోనాపై ఆందోళన మొదలైంది. తలనొప్పి, ఒళ్లు నొప్పులు, రుచి, వాసన లేకపోవడం వంటి లక్షణాలు ఉండటంతో అన్నిరకాల పరీక్షలు చేయించగా కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. కోవిడ్ మొదటి వేవ్ 2020 ఏప్రిల్ నుంచి 2021 మార్చి వరకు కొనసాగింది. రెండో వేవ్ 2021 ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు కొనసాగింది. వ్యాక్సిన్ అందుబాటులోకి రావడం, కరోనా వేవ్స్ కూడా ఆగిపోవడంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. ఆరోగ్యపరంగానే కాకుండా ప్రజల జీవనోపాధితో పాటు మానసికంగానూ కరోనా వేవ్స్ దెబ్బతీశాయి. దేశంలో మళ్లీ కరోనా కేసులు వస్తున్నాయన్న వార్తల నేపథ్యంలో ప్రజల్లోనూ ఆందోళన నెలకొంది. మరోవైపు వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఉన్నతాధికారులు, ఎపిడమాలిస్టులతో ప్రత్యేకంగా సమీక్షించి దిశానిర్దేశం చేశారు. హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో ఇప్పటికే కరోనా రోగుల కోసం ప్రత్యేకంగా వార్డును ఏర్పాటు చేశారు.

కరోనా మరోసారి మహమ్మారిగా మారే పరిస్థితి ఎంత మాత్రం లేదని వైద్య నిపుణులు కొట్టిపారేస్తున్నారు. కోవిడ్ ఎండమిక్‌గా మారిపోయిందని చెబుతున్నారు. కొన్ని సీజన్‌లో కొన్ని ప్రాంతంలో కొంత ప్రభావం చూపించే ఇతర వైరల్ ఫీవర్ల మాదిరిగానే కరోనా ఒకటని స్పష్టం చేస్తున్నారు. అయితే కార్పొరేట్, మెడికల్ మాఫియా మాత్రం మరోసారి కరోనా పేరుతో దోపిడీకి కాచుకుని కూర్చుంది. ఎవరైనా సరే కరోనా పేరుతో దోపిడికి ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఇప్పటికే వైద్యారోగ్యశాఖ మంత్రి హెచ్చరించారు.

సింపుల్ ట్రీట్ మెంట్‌తో నయం : డా. వసంత్ కుమార్

కరోనా గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని డాక్టర్ వసంత్ కుమార్ తెలిపారు. కేవలం నాలుగు రోజుల వ్యవధిలో కరోనా వచ్చిన వారిని చికిత్స చేయొచ్చని చెప్పారు. ఇందు కోసం కేవలం రూ.45 ఖరీదైన మందులు వాడితే సరిపోతుందని తెలిపారు. నాలుగు రోజుల తర్వాత నెగెటివ్ అవుతారని తెలిపారు. కరోనా మళ్లీ వచ్చిందనీ, ఏదో జరిగిపోతుందనే ప్రచారం మెడికల్ మాఫీయాకు, కార్పొరేట్లకు మాత్రమే ఉపయోగపడుతుందని చెప్పారు. కరోనా మళ్లీ రాలేదని, గతంలో వచ్చిన కరోనా పూర్తిగా కనుమరుగు కాలేదని చెప్పారు. రెగ్యులర్ టెస్టులు చేయకపోవడం వల్లే అది కనుమరుగైందనే భావన నెలకొందన్నారు. కేరళలో అక్కడి ప్రభుత్వం మిగిలిన రాష్ట్రాలకు భిన్నంగా రెగ్యులర్ టెస్టులు చేస్తూ పారదర్శకంగా వ్యవహరిస్తున్నదని, వాస్తవ సమాచారంతో ప్రజలను అప్రమత్తం చేస్తున్నదని తెలిపారు. అలాంటి పరిస్థితి మన రాష్ట్రంలోనూ రావాలని ఆకాంక్షించారు.

భయం వద్దు.. జాగ్రత్తలు తీసుకుంటే సరి : డా. కిరణ్ మాదాల

కోవిడ్-19 విషయంలో ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని గాంధీ ఆస్పత్రి క్రిటికల్ కేర్ వైద్యులు డాక్టర్ కిరణ్ మాదాల తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే వదంతులను కాకుండా అధికారిక సమాచారాన్ని విశ్లేషించుకోవాలని సూచించారు. ప్రస్తుతం వెలుగు చూస్తున్న వేరియంట్లతో ప్రాణాపాయం లేదన్నారు. అయితే 60 సంవత్సరాలుపైబడి దీర్ఘకాలిక వ్యాధులు కలిగిన వారు, గర్భిణులు, రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వారం రోజులు ఒళ్లు నొప్పులు, జ్వరం, దగ్గు తగ్గకుంటే సమీపంలోని డాక్టర్ ను సంప్రదించాలని కోరారు.